ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 41 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 24 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## యాదగిరిగుట్టలో అభివృద్ధి పనులకు
# సీఎం రేవంత్ భూమి పూజ

**రూ.43.80 కోట్లతో వేదపాఠశాల.. 9.87 కోట్లతో స్వామివారి నిత్య కళ్యాణ మండపం**

**రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం.. రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్**

**విజయేంద్ర సరస్వతితో కలిసి పాల్గొన్న సీఎం రేవంత్**



**యాదగిరిగుట్ట మే 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటవ్వనుంది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా రూ.100 కోట్లతో చేపట్టే పనులకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చే రెండేళ్లలో వేదపాఠశాల నిర్మాణం పూర్తిచేసి తరగతులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు మెట్లమార్గానికి పైకప్పు, మాడ వీధులకు మెట్లు, దీక్షాపరుల మండలం పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేశారు.

**జగద్గురు సమక్షంలో వేద పాఠశాలకు భూమిపూజ :**

యాదగిరిగుట్ట వెళ్లిన ముఖ్యమంత్రి రేంత్ రెడ్డి 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్..మిగతా 2లో



## చిన్నపిల్లల మిస్సింగ్ కేసులపై
# సుప్రీంకోర్టు ఆందోళన

**వాటిని కిడ్నాప్‌లుగా పరిగణించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ, మే 23 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న చిన్నపిల్లల అదృశ్యం కేసులను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు, వాటిని కిడ్నాప్ కేసులుగా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తప్పిపోయిన పిల్లలను గుర్తించడంలో ఉన్న వ్యవస్థాగత వైఫల్యాలను సరిదిద్దడానికి, అక్రమ రవాణా (ట్రాఫికింగ్) నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ ఆదేశాలు ఇచ్చింది. 2011లో తమిళనాడులో కుమార్తెను పోగొట్టుకున్న ఓ వ్యక్తి దాఖలుచేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై జస్టిస్ అసహనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా, నిరంతరం పెరుగుతున్న పిల్లల అదృశ్యం కేసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ అమానుల్లా మాట్లాడుతూ, " చిన్న పిల్లల మిస్సింగ్ కేసుల్లో చాలా పెద్ద వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం దాదాపు 47వేల మంది పిల్లలు ట్రేస్ కాకుండా మిగిలిపోయారు. గతేడాది ఈ సంఖ్య దాదాపు 10వేల మంది ఉండవచ్చు. ప్రతి సంవత్సరం ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతూనే ఉంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పిపోయిన పిల్లలు తరచుగా వ్యవస్థీకృత అంతర్-రాష్ట్ర అక్రమ రవాణా ముఠాల (సిండికేట్స్) బారిన పడుతున్నారనే క్షేత్రస్థాయి వాస్తవానికి సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న 'క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్' (జజుచీూ) డేటాబేస్, ఛైల్డ్ వెల్ఫేర్ అధికారులు నిర్వహిస్తున్న 'విశాల్ వాత్సల్య' డేటాబేస్ మధ్య సరైన సమన్వయం, ఏకీకరణ లేకపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని ..మిగతా 2లో

## హరీష్ రావు పగటి కలలు మానాలి

**ఫ్యూచర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటనలు**

**అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్ఎస్ లక్ష్యం**

**మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం)**

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా వద్దా ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్ ..మిగతా 2లో

# ఎండల తీవ్రతపై మంత్రి పొంగులేటీ సమీక్ష

**వడదెబ్బకు తాజాగా 16 మంది మృత్యువాత**

**మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం**

**నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు... అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు మృతి**

**మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ప్రకటించిన విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం)**

వడగాలుల ప్రభావంతో ఏడు జిల్లాల్లో నేడు 16 మంది మృత్యువాత పడ్డట్లు ప్రభుత్వం వెల్లడించింది. నిన్నటి ఎండ తీవ్రత కారణంగా 34 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

ప్రజలకు ముందస్తు హెచ్చరికలు : ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ..మిగతా 2లో



## కఠిన సవాళ్లను అధిగమిస్తేనే
# భవిష్యత్‌లోని సవాళ్లు ఎదుర్కోగలం: కేటీఆర్

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా స్నాతకోత్సవంలో**

**పాల్గొన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్**

**సీఎలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సత్కారం**

**సలహాదారులుగా ఎదగాలని సూచన**

2

## గోదావరి పుష్కరాల పనులకు
# రూ.వెయ్యి కోట్లు

**క్యాబినెట్ నిర్ణయాలు ఇవే**



**హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం)**

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్



# గగనతలాన్ని మూసివేసిన ఇరాన్

**పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు**

**ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు**

**తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు**

**టెహ్రాన్,మే23 (ప్రభాత ఉదయం)**


పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను ..మిగతా 2లో

# చిన్నపిల్లల మిస్సింగ్ కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన

మొదటి పేజీ తరువాయి...

కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో పిల్లల మిస్సింగ్ సమస్యను పరిష్కరించడానికి సర్వోన్నత న్యాయస్థానం తాత్కాలికంగా 5 కీలక ఆదేశాలను జారీ చేసింది. విధ సంస్థలు నిర్వహిస్తున్న డేటాబేస్‌లను ఏకీకృతం చేయాలి. తద్వారా పోలీసులు, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు, బాలల సంరక్షణ కేంద్రాల మధ్య సమాచారం (రియల్-టైమ్) తక్షణమే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది.జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు (ఏహెచ్‌టీయూ) ఏర్పాటు చేసినప్పటికీ, అవి పనిచేయడం లేదని లేదా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఏహెచ్‌టీయూలను తగిన అధికారాలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో నాలుగు వారాల్లోపు పూర్తి స్థాయిలో పనిచేసేలా చేయాలని ఆదేశించింది.ఒక బిడ్డ అదృశ్యమైనప్పుడు, అధికారులు దానిని ముందుగానే కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి కేసులను కిడ్నాప్ నిబంధనల కింద నమోదు చేయడం వల్ల దర్యాప్తులో సీరియస్‌నెస్ పెరుగుతుందని, విధానపరమైన అస్పష్టత వల్ల జరిగే ఆలస్యాన్ని నివారించవచ్చని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. పరిస్థితులు మానవ అక్రమ రవాణా లేదా వ్యవస్థీకృత నేర ముఠాల ప్రమేయాన్ని సూచిస్తున్నట్లయితే, దర్యాప్తు సంస్థలు ఆ కేసులను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లకు బదిలీ చేయడానికి నాలుగు నెలలపాటు వేచి చూడకూడదని కోర్టు స్పష్టం చేసింది.

రక్షించిన పిల్లలను సాధారణంగా 24 గంటల్లోపు వారి కుటుంబాలకు అప్పగించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఒకవేళ ఆ కుటుంబానికే అక్రమ రవాణా లేదా వేధింపులతో సంబంధం ఉందని ఆధారాలు



ఉంటే, అప్పుడు ఆ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీలే చూసుకోవాలని పేర్కొంది.

రక్షించిన ప్రతి బిడ్డకు ఆధార్ నమోదు, ధ్రువీకరణ (వెరిఫికేషన్) జరగాలని, దీని వల్ల నకిలీలను నిరోధించడానికి వీలవుతుందని కోర్టు పేర్కొంది. పిల్లల ఆధార్, పర్యవేక్షణను నిర్ధరించడానికి జిల్లా బాలల రక్షణ విభాగాలు (డీసీపీయూ) చురుగ్గా సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతుందని, దేశవ్యాప్తంగా అధికారులు ఈ ఆదేశాలను ఎంత వరకు అమలు చేశారో పరిశీలించిన తర్వాత తదుపరి ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను 2026 ఆగస్టుకు వాయిదా వేసింది.

కేసు నేపథ్యం ఏమిటి?

2011 సెప్టెంబర్ 19న చెన్నైలో తన కుమార్తె అదృశ్యం కావడంతో జి.గణేశ్ అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ రోజే విరుగాంబాక్కం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ ఐఆర్ నమోదు అయ్యింది. కానీ స్థానిక పోలీసులు, ఆ తర్వాత సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినప్పటికీ ఆ చిన్నారి ఆచూకీ లభించలేదు. చివరకు పోలీసులు ఈ కేసును 'అన్‌డిటక్టబుల్' (గుర్తించలేనిది)గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ సమర్పించారు. ఆ తర్వాత తండ్రి దాఖలు చేసిన ప్రొటెస్ట్ పిటిషన్‌ను కొట్టివేశారు. మద్రాస్ హైకోర్టు కూడా 2025 మార్చిలో ఇందులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. దీనితో బాధిత తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ కేసులో అధికారులు, మద్రాస్ హైకోర్టు అనుసరించిన విధానంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తప్పిపోయిన పిల్లల కేసులను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లకు బదిలీ చేయడంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 2013లో జారీ చేసిన సర్క్యులర్, 2011లో తప్పిపోయిన ఈ చిన్నారికి వర్తించదనే వాదనను కోర్టు తప్పుబట్టింది. పిల్లల ఆచూకీ లభించనంత కాలం, బాలల రక్షణ మార్గదర్శకాలు, యాంటీ-ట్రాఫికింగ్ ప్రోటోకాల్‌లను అమలు చేయాల్సిన బాధ్యత కొనసాగుతుందని సర్వోన్నత ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా తప్పిపోతున్న పిల్లల సమస్యపై సుమోటోగా విచారణ చేపట్టి, ప్రతి జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లను పునరుద్ధరించాలనే ఆదేశాలతో పాటు, పై మార్గదర్శకాలను జారీ చేసింది.

# యాదగిరిగుట్టలో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమి పూజ

మొదటి పేజీ తరువాయి...

నుంచి హెలికాప్టర్‌లో యాదగిరి గుట్టకు వెళ్లిన సీఎం ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జగద్గురు పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛరణల నడుమ వేద పాఠశాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. వేదపాఠశాలను రూ.43 కోట్ల వ్యయంతో 15 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఇందులో 300 మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసించే విధంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. వేద పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు. అత్యాధునిక గోశాలతో పాటు యజ్ఞశాల, యాగశాలలు సైతం నిర్మించనున్నారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వేదపాఠశాలలో కంచి కామకోటి పీఠం పర్యవేక్షణలో బోధన చేపట్టనున్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదంతోపాటు ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు వీలు కల్పించి విద్యార్థులకు పట్టాలు




అందించనున్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన : యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించిన అనుబంధ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. 9 కోట్ల 86 లక్షలతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం, కోటి 41 లక్షలతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం, కోటి 34 లక్షలతోతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణంతోపాటు డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణాలకు రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అనంతరం టెంపుల్ సిటీ నుంచి ఆలయ కొండపైకి వెళ్లి లక్ష్మీనరసింహ స్వామి వారిని సీఎం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు.

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు : దర్శనం తర్వాత సీఎం హైదరాబాద్‌కు వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు



మొదటి పేజీ తరువాయి...

ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ఎండల తీవ్రతపై మంత్రి పొంగులేటీ సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

అత్యవసర సమీక్ష నిర్వహించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. జీవరాశుల సంరక్షణ మన బాధ్యత : కలెక్టర్లు వడగాలుల పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని గ్రామ, మండల స్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని అన్నారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రోజంతా ఎండలో డ్యూటీ చేయడంతో మృతి : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రాష్ట్రంలో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వడదెబ్బకు గురై పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలో ముగ్గురు చొప్పున మరణించారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, ఇద్దరు కూలీలు, ఇంకొకరు వ్యాపారి. రోజంతా ఎండలో హైవేపెట్రోలింగ్ డ్యూటీ చేయడంతో ఆరోగ్యం సహకరించక ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో శ్రీనివాస్ కింద పడి మృతి చెందారు. మృతుల్లో ఒకరు మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లిన చెప్పుల వ్యాపారి రాజేశ్వర్ వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ రాజేశ్వర్ మృతిచెందారు.

# గగనతలాన్ని మూసివేసిన ఇరాన్

మొదటి పేజీ తరువాయి...

నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23(ప్రభాత ఉదయం):**




పంటల రక్షణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. శ్రీ రమ్య సూచించారు.శనివారం కేటీదొడ్డి గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. శ్రీ రమ్య రైతులకు ఖరీఫ్ పంటల యాజమాన్యం, యూరియా వినియోగం తగ్గించడం, మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించి వాటి ఆధారంగా ఎరువులు వాడడం, నీటి సద్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వరిలో అధిక దిగుబడి రకాలు, సస్యరక్షణ చర్యలు మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు.టీచింగ్ అసోసియేట్ ఎం. మోతీలాల్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే మల్చింగ్, సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులు అనుసరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు,గ్రామ సర్పంచ్ డి. నారాయణ, ఎఇఓ టి. వెంకటేష్, ఉప సర్పంచ్ ఈ.పెద్దవీరన్న గౌడ్, మండల నాయకులు ఉరుకుందు, రైతులు పాల్గొన్నారు.

# హరీష్ రావు పగటి కలలు మానాలి

మొదటి పేజీ తరువాయి...

మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని, అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేక పోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డు పడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకు పడ్డారు.

# కఠిన సవాళ్లను అధిగమిస్తేనే భవిష్యత్‌లోని సవాళ్లు ఎదుర్కోగలం: కేటీఆర్

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా స్నాతకోత్సవంలో**

**పాల్గొన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్**

**సీఏలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సత్కారం**

**సలహాదారులుగా ఎదగాలని సూచన**

**హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం)**

గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఏలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మారుతున్న కాలంలో సంక్లిష్టమైన పన్ను నిబంధనలు, జీఎస్టీ వ్యవస్థ, వ్యాపారాల విస్తృతి నేపథ్యంలో దేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేయడంలో సీఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సలహాదారులుగా ఎదగాలి : సమాజంలో పారదర్శకతను పెంచే బాధ్యత వీరిపైనే ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సీఏ కోర్సులోని కఠినత్వాన్ని, ఆ ఒత్తిడిని అధిగమించి విజయం సాధించిన ప్రతి విద్యార్థి, భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాలునైనా ధైర్యంగా ఎదుర్కోగల శక్తిమంతులని అభినందించారు. సీఏలు కేవలం అకౌంటింగ్ లేదా పన్నులకే పరిమితం కాకుండా, వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థలు బలోపేతం అయినప్పుడే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా సామాన్య ప్రజల సంక్షేమానికి మార్గం సుగమం అవుతుందని ఆయన వివరించారు. పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చు : మారుతున్న ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను వృత్తిలో భాగంగా చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని ఉద్ఘాటించారు. ఈ స్థాయికి చేరుకోవడంలో విద్యార్థుల వెనుక ఉన్న తల్లిదండ్రుల అపారమైన త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని, వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు సీఏ శ్రీధర్ ముప్పాళ్ల సీఏ దాయనివాస్ శర్మ ఐసీఏఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో విత్తన మేళాను ప్రారంభించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**బుద్వేల్, మే 23 (ప్రభాత ఉదయం)**

నాణ్యమైన విత్తనాన్ని రైతుకు అందజేసి వారు స్థిరమైన ఆదాయాన్ని పొందే విదంగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని, వారందరికి ధన్యవాదాలు తెలియజేసు న్నానని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లోని వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్) క్యాంపస్ లో శనివారం నిర్వహించిన విత్తన మేళా ను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రారంభించి ముందుగానే బుక్ చేసుకున్న రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఈ నెల 30 వరకు 1200 టన్నుల విత్తనాలను రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆదర్శ, అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేసి వారి ద్వారా ఆయా గ్రామాల రైతులకు విత్తనాలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దొడ్డి దారిన విక్రయించే విత్తనాలను రైతులు తీసుకోవద్దన్నారు. ఆదర్శ రైతులు అభివృద్ధి చేస్తున్న విత్తనాలను తీసుకోవాలన్నారు. గడిచిన 60 సంవత్సరాలుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు సేవలందిస్తుందన్నారు. మొదటగా స్థాపించిన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోనే రెండవ విశ్వవిద్యాలయం అని గుర్తు చేశారు. తెగుళ్లు, కార్మికుల సమస్యలు ఉంటున్న ఈ సందర్భాలలో డ్రోన్ ల ద్వారా పురుగుమందుల స్ప్రే చేయడం పై రైతులకు, మహిళా రైతులకు శిక్షణ ఇచ్చి డ్రోన్ ద్వారా పనులు చేసే విదంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. రోబోల ద్వారా కలుపు మొక్కలు, మం దులు చల్లడం చేయడం పై కూడా శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. డిజిటల్ అగ్రికల్చర్ పై వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని, ఇంటి దగ్గర ఉండే రైతులు పంటలకు నీరు పెట్టే విధానాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సెన్సార్ పద్దతుల ద్వారా ఈ విధానాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు ల్యాబ్లలో ఉండకుండ రైతుల పొలాలలోకి వెళ్లి వారికి వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించే కార్యక్రమాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపడుతున్నామన్నారు. ప్రపంచీకరణ ఏర్పడిన తర్వాత ప్రపంచంతో పోటీ పడే వ్యవసాయం చేయాలన్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలనే పండించాలన్నారు. మంచి విత్తనాలు ఎన్నుకుని పంటలు పండించాలన్నారు. ఒకే పంటను మళ్లీ మళ్లీ వేయకూడదన్నారు. డిమాండ్ ఉన్న పంటల తో పాటు ఎగుమతులకు అనుకూలమైన పంటలను పండించడం మంచిదన్నారు. అధిక ఉత్పత్తులతో పాటు మార్కెటింగ్ కు అనుకూలమైన పంటలను పండించడానికి ముందుకు రావాలన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ వై. చంద్రమోహన్ లు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ కు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు పుష్ప గుచ్చం అందచేస్తున్న వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

## టైరు పేలి ఔటర్ రింగ్ రోడ్డులో బోల్తా పడిన లారీ

**బుద్వేల్, మే 23 (ప్రభాత ఉదయం)**



హిమాయత్సాగర్ ఔటర్ రింగురోడ్డు ఎక్జిట్ 17 వద్ద శనివారం తెల్లవారుజామున ఓ లారీ బోల్తా పడింది. శంషాబాద్ నుంచి నార్సింగ్ వైపు వెళ్తున్న ఓ లారీ టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపు తప్పి వాహనం పల్టీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు లారీ లోని సామాగ్రి రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయింది. దీంతో కొద్ది సమయం ట్రాఫిక్ కు అంతరాయం కలిగిం ది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అమర్ కు తలకు తీవ్రమైన గాయం అయ్యింది. ఆయనను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, ఔటర్ రింగ్ రోడ్డు సిబ్బంది క్రేన్ సహయంతో రోడ్డు మధ్యలో పడి పోయిన లారీని పక్కకు తొలగించారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి.



మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి ని సన్మానిస్తున్న ఎన్ ఎస్ యు ఐ జాతీయ మాజీ కార్యదర్శి , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్లా సౌజన్య



మహిళా కమిషన్ సభ్యురాలు కుమారి అబ్దేశి సదాలక్ష్మి ని సన్మానిస్తున్న ఎన్ ఎస్ యు ఐ జాతీయ మాజీ కార్యదర్శి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్లా సౌజన్య

## మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మీ, సభ్యురాలు కుమారి అబ్దేశి సదాలక్ష్మి లకు సన్మానం

**బుద్వేల్, మే 23 (ప్రభాత ఉదయం)**


మహిళల రక్షణ, వారి హక్కుల సాధన కోసం మహిళా కమిషన్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకరమని ఎన్ఎస్ఎరీఐ జాతీయ మాజీ కార్యదర్శి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నల్లా సౌజన్య అన్నారు. మహిళా కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మిని ఆమె శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సల్లా సౌజన్య మాట్లాడుతూ, మహిళల హక్కులు, వారి రక్షణ కోసం కమిషన్ చైర్మన్, సభ్యులు గట్టిగా పనిచేసా రని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సదాలక్ష్మి కి సన్మాణం**

రాజేంద్రనగర్ కు చెందిన కుమారి అబ్దేశి సదాలక్ష్మి ని మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించడం ఈ ప్రాంతానికి ఎంతో మేలుకరమని ఎన్ఎస్ఈయూఐ జాతీయ మాజీ కార్యదర్శి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సల్లా సౌజన్య అన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమితులైన ఎ సదాలక్ష్మిని సల్లా సౌజన్య శనివారం మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. నిరంత రం ప్రజల కోసం ఆలోచించే సదాలక్ష్మి మహిళా కమిషన్ సభ్యురాలు గా మహిళలకు పూర్తిగా అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాత కర్నూల్ రోడ్డు లోని రైల్వే అండర్ పాస్ లో మురుగునీరు నిల్వ ఉండకుండ చూడాలి.

**బుద్వేల్, మే 23 (ప్రభాత ఉదయం)**



పాత కర్నూలు రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ లో ప్రవహిస్తున్న మురుగు నీరు

గగనపహడ్ పాత కర్నూల్ రోడ్డు నుంచి కాటేదాన్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్ లోకి మురుగునీటి తో పాటు, కాలుష్య వ్యర్థ జలాలు వస్తుండటంతో ఆ మార్గంలో వాహనాలపై వెళ్లే వారికి, నడుచుకుంటు వెళ్లే వారికి అసౌకర్యంగా ఉ ంటుంది. గగన్పహడ్ నుంచి కాటేదాన్ వెళ్లాలన్నా, కాటేదాన్ నుంచి గగన్ పహడ్ రావాలన్నా ఇదే దారి గూండా రావాల్సి ఉ ంటుంది. ఈ అండర్ పాస్ లోకి పై నుంచి మురుగునీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై వెళ్తున్న సమయంలో మురుగునీరు బట్టలపైన పడుతుం దని వాపోతున్నారు.

**2009 నుంచి ఇదే పరిస్థితి**

గగన్పహడ్ నుంచి కాటేదాన్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్డు మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్ 2009 లో ప్రారంభమైంది. అప్పటి నుంచి అటుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందిగానే మారింది. ఈ సమస్య పరిష్కారం లో అధికారులు పూర్తిగా విఫలమైనారనే చెప్పవచ్చన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రతి రోజు డ్రైనేజీ మురుగునీరు జల పాతం లాగా ప్రధాన రహదారిపై పడుతు ఉండటంతో దుర్వాసన, దోమల వ్యాప్తి, ప్రజలు ఆరోగ్య సమస్యలకు గురికావడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

**వర్షాకాలంలో మరింత అధ్వాన్నం : సూరెడ్డి వినయ్ రెడ్డి, బీజేపీ మైలార్ దేవుపల్లి డివిజన్ - 2 అధ్యక్షులు**

జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలికంగా మరమ్మత్తులు చేస్తున్నారని బీజేపీ మైలార్దేవుపల్లి డివిజన్ - 2 అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేస్తు చేతులు దులుపుకుంటారన్నారు. పాత కర్నూల్ రోడ్డు లోని రైల్వే అండర్ పాస్ లో మురుగునీరు నిల్వ ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**మరమ్మత్తులు చేయాలని ఈ రోజే ఈఈ వెంకట శేషయ్య కు చెప్పాను : ఎస్ఈ నరేందర్ గౌడ్ :**

పాత కర్నూల్ రోడ్డు లో ఉన్న రైల్వే అండర్ పాస్ లోకి మురుగునీరు ప్రవహిస్తున్న మాట నిజమే. ఈ రోజే చూసి ఇంజనీరింగ్ విభాగం ఈఈ వెంకఠ శేషయ్య కు చెప్పాను. త్వరలోనే పనులు చేయిస్తారు.

# హైదరాబాద్ రీజియన్‌లో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

**రాజేంద్రనగర్, మే 23 ( ప్రభాత ఉదయం):**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో బాగంగా హైదరాబాద్ రీజియన్ పరిధిలోని 14 ఆర్టీసీ బస్సు డిపోలకు చెందిన 154 మంది క్రీడా కారులకు శనివారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను హైదరాబాద్ రీజినల్ మేనేజరు సుధ పరిమళ పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. పురుషులకు, స్త్రీలకు 100 మీటర్ల పరుగు పందెం, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు స్త్రీ పురుషుల కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మ్యూజికల్ చైర్ పోటీలు కేవలం మహిళా సిబ్బంది కోసం ఆడిపిస్తున్నామన్నారు. నిత్యం బిజిగా ఉండే ఆర్టీసీ సిబ్బంది జీవితాలలో ఆనందం, సంతోషాన్ని నింపడానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆలోచనలతో ఈ పోటీలు నిర్వహిం చడం జరిగిందన్నారు. ఆర్టీసీ సిబ్బంది అవసరమున్న సమయంలో వాకింగ్ చేయడం మంచిదన్నారు. 14 డిపోల నుంచి వచ్చిన ఆర్టీసీ సిబ్బంది ఒకే వేదికపై క్రీడా పోటీలలో పాల్గొనడం సంతోషకరమైన విషయం అన్నారు. క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజరు మాధవి, రాజేంద్రనగర్, బర్కత్ పుర, ఫారూఖ్ నగర్, మెహిదీపట్నం, హయత్ నగర్ , ఆర్టీసీ బస్సు డిపోల మేనేజర్లు బి క్రిష్ణారెడ్డి, మంజుల, వేదవతి, క్రిష్ణమూర్తి, శ్రీనివాస్, ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ రీజినల్ పర్సనల్ ఆఫీసర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ రీజినల్ మేనేజర్ సుధ పరిమళ



బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం

## డ్రైనేజీ లీకేజీ సమస్యకు పరిష్కారమెప్పుడు..?

**నాలుగుసార్లు గెలిచిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధి చేసింది సున్నా...,**

**బీజేపీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి**

**రాజేంద్రనగర్,మే23(ప్రభాత ఉదయం)**



గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్ అండర్‌పాస్ వద్ద గత 16సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజ్ లీకేజ్ సమస్య కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు.2009లో ఈ అండర్‌పాస్ ప్రారంభమైనప్పటి నుండి ఈ సమస్య అలాగే ఉండిపోయినా,ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి రోజు డ్రైనేజ్ మురుగు నీరు జలపాతం లాగా ప్రధాన రహదారిపై పడుతూ ఉండటంతో తీవ్ర దుర్వాసన,దోమల పెరుగుదల,ప్రజల ఆరోగ్య సమస్యలు,ట్రాఫిక్ ఇబ్బందులు మరియు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ ఈ ప్రధాన రహదారిని ఉపయోగిస్తున్నప్పటికీ ప్రభుత్వం,సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.ఇది అత్యంత సిగ్గుచేటైన విషయమన్నారు.2009 నుండి ఇదే స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు.ప్రతి రోజు ఈ అండర్‌పాస్ మీదుగా ప్రయాణించే ప్రజల ఇబ్బందులు స్థానిక ఎమ్మెల్యేకు కనిపించకపోవడం బాధాకరమన్నారు.

వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి నీటి నిల్వలు,జారిపడే ప్రమాదాలు,వాహనదారులకు ఇబ్బందులు,స్కూల్ పిల్లలు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయన్నారు.

ఇంత ముఖ్యమైన రహదారిపై ఉన్న సమస్యను సంవత్సరాలుగా పరిష్కరించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు.రాజేంద్రనగర్ ప్రజలు పనికిరాని ప్రభుత్వం,నిర్లక్ష్య నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు.

మున్సిపల్,జలమండలి,సంబంధిత శాఖలు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.తక్షణ చర్యలు తీసుకోకపోతే స్థానిక ప్రజలు,వాహనదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు,నిరసనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.



మహిళా కమిషన్ సభ్యురాలు గా నియమితులైన కుమారి అబ్దేశి సదాలక్ష్మి కి పుష్ప గుచ్చం అందచేసి శు భాకాంక్షలు తెలుపుతున్న స్వేర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు క్యాసారం శంకర్ రావు

## ప్రభుత్వ భూములను కాపాడాలి

**హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ను కలసి వినతి పత్రం అందజేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్**

**బుద్వేల్, మే 23 (ప్రభాత ఉదయం)**



హైడ్రా కమిషనర్ ఎ వి రంగనాథ్ కు వినతి పత్రం అందచేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండ హైడ్రా కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఎవి రంగానాథ్ కు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురి కాకుండ చూడాలన్నారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మార్కండేయనగర్, బాబుల్ రెడ్డి నగర్ ను ఆనుకుని ఉన్న నర్సభాయి కుంటను అభివృద్ధి చేయాలన్నారు. గగన్ పహడ్ అప్ప చెరువు ను కాపాడి అభివృద్ధి చేయాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడటమే తన ధ్యేయం అన్నారు. చెరువులను రక్షించాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు ఎవరు చేసినా వాటిని తొలగించాలన్నారు.



రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సన్మానిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దాసరి రమేష్, దళిత సంఘాల ప్రతినిధులు

## రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మిని సన్మానించిన రాజేంద్రనగర్ ఎం ఆర్ పి ఎస్, దళిత సంఘాల ప్రతినిధులు

**రాజేంద్రనగర్, మే 23(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మి ని రాజేంద్రనగర్ డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంత్ ఉత్సవాల కమిటీ, ఎం ఆర్ పి ఎస్, దళిత సంఘాల ప్రతినిధులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. శనివారం బుద్ధ భవనంలోని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర సభ్యురాలు గాని మిత్రులైన కుమారి అబ్దేసి సదాలక్ష్మి ని సన్మానించిన వారిలో రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులు దాసరి రమేష్, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం నర్సింహా మాదిగ, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్, జయంత్ ఉత్సవాల ఉత్సవ కమిటీ వ్యవస్థాపకులు పోయిల జీవన్ దాస్, ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక నాయకులు, హార్టికల్చర్ యూనివర్సిటీ టీఎన్జీవోస్ నాయకులు పోతురాజు యాదయ్య మాదిగ, ఎం ఆర్ పి ఎస్ నాయకులు క్యాసారం శంకర్ రావు మాదిగ,గుంటి సురేష్ మాదిగ,,పచ్చ శ్రీనివాస్,పచ్చ నర్సింగ్ రావు, గోల్కొండ రాజు కుమార్, ఎడ్లకాడి సూర్యం,కాచూరి నర్సింగ్ రావు,గోల్కొండ లేవి రాజ్,మన్నె శేకర్,ఎడ్లకాడి చంద్ర శేకర్,నాగని సురేష్,కవ్వగూడెం జనార్ధన్, గౌతమ్,బర్ల సుమన్,ఎడ్లకాడి అనిల్ కుమార్,రాము,గిరిబాబు,ఆనంద్,కెన్ని తదితరులు ఉన్నారు.

# సమాజ సురక్షితకు 'సైబరాబాద్' భరోసా: డీకాయ్ ఆపరేషన్లతో ఆకతాయిల ఆటకట్టు!

### మహిళలు, పిల్లల రక్షణే శ్వాసగా షీ టీమ్స్, ఎహెచ్టియూ ముమ్మర చర్యలు..

**శేరిలింగంపల్లి : మే 23 (ప్రభాత ఉదయం)**



హెచ్ఎస్బీసీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిసిపి సృజన మహిళా అధికారులు..


సమావేశానికి హాజరైన ఐటీ ఉద్యోగులు

సమాజంలో సగం ఉన్న మహిళల రక్షణే ధ్యేయంగా, పసిమొగ్గల భవిష్యత్తే లక్ష్యంగా సైబరాబాద్ పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా సేవలు అందిస్తోంది. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తామున్నామంటూ భరోసా కల్పిస్తూ.. శాంతిభద్రతల పరిరక్షణలో సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తోంది. గత వారం రోజుల్లో సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ చేపట్టిన ఆపరేషన్లు, సాధించిన విజయాల సమగ్ర నివేదికను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సృజన వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల ఆటకట్టించడానికి షీ టీమ్స్ విస్తృతంగా రంగంలోకి దిగాయి. వారం రోజుల్లో 102 డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించడం జరిగింది. 24 మంది నిందితులను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసుల తీవ్రతను బట్టి 30 పెట్టీ కేసులు నమోదు చేయగా మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అలాగే వివిధ మాధ్యమాల ద్వారా బాధితుల నుండి వచ్చిన 20 ఫిర్యాదులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఒక పీట కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, ఒక బాధితురాలిని రక్షించింది. అలాగే జేజే యాక్ట్ కింద ఇద్దరు మైనర్ బాలురను రక్షించి ఇద్దరు నిందితులను కటకటాల్లోకి నెట్టామన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా చెదిరిపోయిన సంసారాల్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు సత్ఫలితాలను ఇచ్చాయి. కౌన్సిలర్ల చొరవతో 35 కుటుంబాలు తిరిగి ఒకటయ్యాయని డీసీపీ తెలిపారు. 2,378 మందికి విస్తృత నేరాలను అరికట్టేందుకు అవగాహనే కల్పించడం జరిందన్నారు. బాలల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్, స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్, సైబర్ ఫ్రాడ్స్ వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆపదసమయంలో మహిళా 181, చైల్డ్ హెల్ప్లైన్ 1098, డయల్ 100, సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ 1930 నెంబర్ ప్రాధాన్యతను వివరించారు. కార్పొరేట్ ఉద్యోగుల భద్రత, మానసిక శ్రేయస్సే లక్ష్యంగా సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మే 19న హెచ్ఎస్బీసీ క్యాంపస్లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 150 మందికి పైగా ఉద్యోగులు హాజరయ్యారు. డీసీపీ సృజన తెలిపారు.

# కెటిఆర్, ఎమ్మెల్యే మాయమాటలకు మోసపోకండి..ఆత్మ విమర్శ చేసుకోండి

### బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి పిలుపు

**కూకట్ పల్లి, మే 23 (ప్రభాత ఉదయం)**



బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను మరోసారి మాయమాటలు చెప్పి మోసం చెయ్యడానికి కేటీఆర్, కూకట్ పల్లి ఎమ్మెల్యే రంగం సిద్ధం చేస్తున్నారని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. 25 వ తేదీన కూకట్ పల్లి ఎన్.కె.ఎన్.ఆర్. గార్డెన్ లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం అందుకు నిదర్శనమని అన్నారు. గతంలో అనేక సందర్భాల్లో ముఖ్యంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎన్నిక ముందు అనేక బహిరంగ సభల్లో తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇస్తామని కెటిఆర్ చెప్పిన మాటలు వాస్తవం కాదా అని గుర్తుచేశారు. కెటిఆర్ మాటలకు ఆహా..ఓహో..అంటూ వత్తాసు పలికిన ఎమ్మెల్యే కూడా అవే మాయమాటలు చెప్పి తెలంగాణ ఉద్యమంలో విరచిత పోరాటం చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. పప్పులో కరివేపాకును వేసినట్లు ఎన్నికలు సమీపిస్తున్నాయంటే కార్యకర్తలను వాడుకుని వదిలెయ్యడమే కెటిఆర్, ఎమ్మెల్యే నైజం అని తీవ్రంగా విమర్శించారు. కార్యకర్తలను రెచ్చగొట్టడం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దిట్ట అని పేర్కొన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరం కృష్ణారావు ఆయన, ఆయన కుమారుడు దినదినం అభివృద్ధి చెందుతూ కోట్లకు పడగలెత్తారని, ఎమ్మెల్యేను నమ్ముకున్న కార్యకర్తలకు నామినేటెడ్ పదవులుగానీ, అభివృద్ధి చెందిన దాఖలాలు గానీ ఎక్కడా లేవని తీవ్రంగా విమర్శించారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మరోసారి కార్యకర్తలను మోసం చేసి మాయమాటలు చెప్పేందుకు సోమవారం వస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కెటిఆర్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని, ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని పిలుపునిచ్చారు.



# సమాజ రక్షణలో నిరంతరం శ్రమించే పోలీస్ల ఆరోగ్యంపై సైబరాబాద్ పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి

### పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి...డీసీపీ రితీరాజ్

### బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం

**కూకట్ పల్లి, మే 23 (ప్రభాత ఉదయం)**

సమాజ రక్షణలో నిరంతరం శ్రమించే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై సైబరాబాద్ పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న సిబ్బంది కోసం బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కూకట్ పల్లి డీసీపీ రితీరాజ్ (ఐపీఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ హెల్త్ క్యాంప్నకు విశేష స్పందన లభించింది. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తూ, మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్న పోలీసుల సంక్షేమం కోసం సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు కూకట్ పల్లి డీసీపీ రితీరాజ్ తెలిపారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో జరిగిన ఈ శిబిరంలో కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని బాలానగర్, కూకట్ పల్లి, అల్లాపూర్ ప్రాంతాలకు చెందిన లా అండ్ ఆర్డర్, అలాగే ట్రాఫిక్ విభాగానికి చెందిన సుమారు 157 మంది పోలీస్ సిబ్బంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ప్రముఖ 'సింధు హాస్పిటల్' సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు సిబ్బందికి కీలకమైన పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా పోలీసులలో ఒత్తిడి, జీవనశైలి లోపాలను గుర్తించేందుకు వీలుగా... విటమిన్-డి, విటమిన్-బి12, హెచ్బిఎ 1సీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం వైద్యులు సిబ్బందికి ఆరోగ్య సూత్రాలను, తగిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి, బాలానగర్, అల్లాపూర్ పరిధిలోని సీఐలు, డీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డీసీపీ రితీరాజ్, ఐపీఎస్,మాట్లాడుతూ"పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం మానసిక, శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అందుకే వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక హాస్పిటల్స్, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో తరచూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. సరైన సమయానికి భోజనం చేయడం, యోగా, ధ్యానం వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలి. సిబ్బందికి మెరుగైన వైద్య సేవలు అందించిన సింధు హాస్పిటల్ బృందానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోధాంలకు తరలించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23(ప్రభాత ఉదయం)**

రైతులు పండించిన మొక్కజొన్నలతో పాటు వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి గోదాములకు తరలించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం బీజేపీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మండలాధ్యక్షుడు శ్రీపాద రెడ్డి ఆధ్వర్యంలో కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు పండించిన మొక్కజొన్న, వరి పంటలు గోనె సంచులు లేక కొనుగోలు కేంద్రాలలో నిలిచిపోయిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం లారీలు లేక సెంటర్లలోని ఉంచడం జరిగిందన్నారు. ఈ విధంగా రైతులకు వర్షాకాలం సంభవిస్తున్నది ఎండలకు వానలకు ధాన్యం తడిసి ముద్దయి పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని, రైతులు పడుతున్న గోస ఈ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ వారి ధాన్యానికి సంబంధించిన డబ్బు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం లేదు అని, వారు పంటకి అప్పులు తెచ్చుకొని నానా బాధలు పడుతున్నారని, వెంటనే రైతుల ఖాతాలో డబ్బు జమ చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో బీజేపీ ఆద్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం రైతులు పడుతున్న బాధలను తీర్చాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి, ఓబిసి మండలాధ్యక్షుడు ముంగిలి వీరేష్, నాయకులు కృష్ణకాంత్, దేవేందర్ రెడ్డి, కర్రెప్ప, కొండన్న, నర్సింలు, రంగారెడ్డి , గోవిందు, పాల్గొన్నారు.

# కూకట్పల్లి ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి కి బండి రమేష్ వినతి

**కూకట్ పల్లి, మే 23 (ప్రభాత ఉదయం)**



కూకట్పల్లి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న భూ, రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతుల సమస్యల పరిష్కారం కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ శనివారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూల మొక్క అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కూకట్పల్లి నియోజకవర్గంలోని వసంత్నగర్ పరిధిలోని సర్వే నెంబర్లు 145, 163కు సంబంధించిన ఐడిపిఎల్ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత కొంతకాలంగా ఆ ప్రాంతంలోని ఇళ్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, అంతేకాకుండా గత ఏడాది కాలంలో రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లకు కూడా నిర్మాణ అనుమతులు అధికారులు ఇవ్వడం లేదని బండి రమేష్ మంత్రికి వివరించారు. దీంతో గత 40 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న స్థానిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బండి రమేష్ తెలిపారు. సమస్య ఎక్కడ ఏర్పడిందో స్వయంగా అధికారులతో మాట్లాడి తెలుసుకుని, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని బండి రమేష్ స్పష్టం చేశారు.

# డ్రగ్స్ మాఫియా గుండెల్లో 'సైబరాబాద్' పోలీసులు

### 50 రోజుల్లో రూ.3.69 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్.. 154 మంది అరెస్ట్

**శేరిలింగంపల్లి , మే 23,(ప్రభాత ఉదయం)**


సీజ్ చేసిన డ్రగ్స్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్ ఓ టి డీసీ శోభన్ కుమార్..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల విక్రయదారులు, వినియోగదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎన్డీపీఎస్ చట్టం కింద సైబరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలోగడిచిన 50 రోజుల్లో కమిషనరేట్ పరిధిలో ముమ్మర దాడులు నిర్వహించినట్లు సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ డీసీపీ శోభన్ కుమార్ తెలిపారు. కళ్లు చెదిరేలా రికార్డు స్థాయి రికవరీ కేసులు నమోదు 61 మందిని అరెస్టు చేసయడంతో పాటు 154 మంది డ్రగ్ పెడ్లర్లు అరెస్టు చేసినట్లు వివరించారు. సీజ్ చేసిన డ్రగ్స్ విలువ సుమారు రూ. 3,69,21,200/ (మూడు కోట్ల అరవై తొమ్మిది లక్షల ఇరవై ఒక్క వేల రెండు వందలు ఉంటుందని శోభన్ కుమార్ వెల్లడించారు. సాంప్రదాయ గంజాయితో పాటు విదేశాల నుండి సరఫరా అవుతున్న సింథటిక్ డ్రగ్స్ ఎండీఎంఏ, కొకైన్ తదితర నెట్వర్క్లను పూర్తిగా ధ్వంసం చేస్తామని డీసీపీ శోభన్ కుమార్ హెచ్చరించారు. నిఘా వర్గాల పక్కా సమాచారంతో, పకడ్బందీ వ్యూహంతో ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. డ్రగ్స్ సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



# నిరుపేదప్రజలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### ప్రభుత్వాలను డిమాండ్ చేసిన ఈటెల.

### భూదాన్ భూముల సమస్యపై ఎంపీ ఈటెల రాజేందర్కి స్థానికుల వినతి

**కూకట్ పల్లి, మే 23(ప్రభాత ఉదయం)**


కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని ఆచార్య వినోబాభావే పురం (ఏవీబీపురం)తో పాటు భూదాన్ బోర్డుకు సంబంధించిన స్థలాలను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సందర్శించారు.ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్థానిక ప్రజలతో కలిసి ఎంపీకి భూదాన్ భూముల సమస్యలను వివరించారు.స్థానిక ప్రజలు మాట్లాడుతూ... భూదాన్ బోర్డుకు సంబంధించిన భూములను పేద, మధ్యతరగతి ప్రజలకు అమ్మి డబ్బులు వసూలు చేశారని, ఇప్పుడు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే సమయంలో అవి ఐడిపిఎల్కు చెందిన భూములని చెబుతూ ఐడిపిఎల్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి మోసపోయామని తమ గోడును ఎంపీకి వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కూకట్పల్లిలో సుమారు 26.6 ఎకరాల భూదాన్ భూమి ఉందని, పేద , మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని చెప్పి తప్పుడు హామీలు ఇచ్చారని ఆరోపించారు. ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డబ్బులు తీసుకుని ప్రజలను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా స్థానిక దళితులు, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉన్నా ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పర్యాటక రంగానికి 'ప్రైవేట్' ఊతం:మంత్రి జూపల్లి కృష్ణారావు

### ప్రాజెక్టుల వేగవంతానికి సింగిల్ విండో అనుమతులు, దీర్ఘకాలిక లీజులు

### ఉపాధి కల్పనే లక్ష్యంగా నూతన పర్యాటక పాలసీ

**శేరిలింగంపల్లి : మే 23 (ప్రభాత ఉదయం)**


ఇంటర్నేషనల్ టూరిజం డెస్టినేషన్ కార్యక్రమం పాల్గొన్న వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులతో మంత్రి జూపల్లి..

తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా (ఇంటర్నేషనల్ టూరిజం డెస్టినేషన్) తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగాన్ని ఒక ప్రధాన ఇంజన్గా మారుస్తామని ఆయన ప్రకటించారు. గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణంలో నిర్వహించిన "డెస్టినేషన్ తెలంగాణ రోడ్ అహెడ్" ప్రతిష్టాత్మక పర్యాటక సదస్సుకు జూపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలుముగింపు కార్యక్రమాని మంతి ముఖ్య అతిథి విచ్చేసి మాట్లాడుతూ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేటు భాగస్వామ్యానికి ఎర్రకార్పెట్ పరుస్తున్నట్లు తెలిపారు. "మీరు సరైన ప్రతిపాదనలు, డీపీఆర్ రావాలని సూచించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని పారిశ్రామిక వేత్తలకు మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం వృథాగా ఉన్న ప్రభుత్వ ఆస్తులను పర్యాటక అవసరాల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి త్వరలోనే 'ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' ప్రకటనలు జారీ చేస్తామధన్నారు. ఇందులో ఎంపికయ్యే సంస్థల ప్రాజెక్ట్ డిజైన్ల అంచనా వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో కనీస వసతులైన తాగునీరు, రెస్ట్ రూమ్స్, రెస్టారెంట్లు లేకపోవడాన్ని అధిగమించేందుకు మొబైల్ గ్లాస్ హౌస్లు, కాన్వాస్ టెంట్లు వంటి ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులు ముందుకు రావాలి కోరారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు అది ఉపాధి కల్పించే కల్పవృక్షం ప్రపంచంలో ఎన్నో చిన్న దేశాలు కేవలం పర్యాటకంపైనే ఆధారపడి ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రమోట్ చేయడం మనందరి సమిష్టి బాధ్యత అన్నారు. భువనగిరి కోటకు రోప్వేరాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించేందుకు వినూత్న ప్రాజెక్టులను చేపడుతున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే భువనగిరి కోటలో రోప్వే వంటి ఆధునిక ఆకర్షణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి వెల్లడించారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్' విధానంలో పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సులో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, టీజీటీడీసీ ప్రతినిధి పటుల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రజింత్ నాయక్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొ అర్జున రావు పాల్గొన్నారు. అలాగే ప్రైవేట్ రంగం నుండి రామోజీ ఫిల్మ్ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఏ. విశ్వంభర రావు, ఎక్స్పీరియం పార్క్ చైర్మన్ రామడుగు రామ్ దేవ్ రావు, ప్రగతి రిసార్ట్స్ చైర్మన్ జీబీకే రావు, వేద కుమార్, అలంకృత రిసార్ట్స్ ఎండీ ఆదిత్య దీన్ దయాల్ తదితర ప్రముఖులు పాల్గొని తమ అమూల్యమైన సూచనలను అందించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608